క్లుప్తంగా

ఘనంగా సభావేదిక ప్రారంభం



కళాశాల సభావేదికను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, దాతలు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన సభావేదికను శుక్రవారం ప్రిన్సిపాల్ మమత, విశ్రాంత కస్టమ్స్ ఆఫీసర్ వెంకటస్వామి, లక్ష్మీకాంతమ్మ దంపతులు, విశ్రాంత పోస్టుమాస్టర్ కృష్ణమోహన్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల 1973–75 బ్యాచ్ విద్యార్థులైన విశ్రాంత కస్టమ్స్ అధికారి వెంకటస్వామి, విశ్రాంత పోస్టుమాస్టర్ కృష్ణమోహన్ సభావేదిక, ద్వారం, గ్రిల్, విద్యుత్ సౌకర్యం కల్పించారన్నారు. దాతలు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తామన్నారు. అనంతరం దాతలను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

ఓటర్ నమోదుపై స్పెషల్ డ్రైవ్

కూడేరు: ఓటర్ నమోదుపై మండలంలో శనివారం, ఆదివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి శుక్రవారం తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్ నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే జాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాపు భారతి

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బసిరెడ్డి (52) దీర్ఘకాలిక వ్యాధితో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. నివాళులర్పించిన వారిలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు న్నారు.

సచివాలయాల తనిఖీ

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు1, కలుగోడు-2 , బేలోడు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించి ప్రజలతో సఖ్యతగా ఉంటూ అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

లక్ష్మీ నరసింహస్వామికి పూజలు



మూలవిరాట్‌ను ఊరేగిస్తున్న గ్రామస్తులు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో వెలసిన పెన్నోబుళ లక్ష్మీనరసింహస్వామిని గ్రామస్తులు శుక్రవారం ఘనంగా ఊరేగించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను బీటీ ప్రాజెక్టులోకి తీసుకెళ్లి పవిత్ర గంగాజలంతో శాస్త్రోక్తంగా అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జీర్ణోద్ధరణ చేసిన ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

కూడేరు: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇన్‌చార్జ్ జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి వెంకటేశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం కూడేరులోని కేజీబీవీలో బాల్య వివాహాల ద్వారా కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలన నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ ఉమాదేవి, ఏఎస్‌ఐ రామానాయుడు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ, డీసీపీయూ సిబ్బంది రమాదేవి, మహిళా పోలీసు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

‘రియల్’ మోసం

- ప్లాట్ల విక్రయాల పేరుతో రూ. అరకోటికి పైగా స్వాహా
- రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు



పట్టణ సమీపాన అడిగుప్ప రహదారిలో ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్ (ఇన్‌సెట్‌లో) న్యాయం చేయాలంటున్న బాధితులు

రాయదుర్గం: పట్టణ సమీపాన అడిగుప్ప దారిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో రియల్టర్లు నిబంధనలకు పాతరేశారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతరగా మార్పు చేపట్టలేకపోయారు. ఆఖరుకు ‘భూ’ యజమాని నుంచి బదలాయింపు కూడా జరగలేదు. ఈ క్రమంలో ఇద్దరు రియల్టర్లు ఆడిన మైండ్‌గేమ్‌కు 60 మందికి పైగా పేదలు దగాకు గురయ్యారు. లేఅవుట్‌లో ప్లాటు ఖరీదు కేవలం రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల మధ్యనే ఉంది అంటూ నమ్మబలికారు. వారి మాటలగారడీకి మోసపోయిన పేదలు రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకూ అడ్వాన్స్ చెల్లించి మోసపోయారు. ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు పోలీస్, రెవెన్యూ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

రిజిస్ట్రేషన్ కాకనే ప్లాట్ల విక్రయాలు

పట్టణంలోని కే ఉమాదేవికి చెందిన సర్వే నెంబర్ 28 లో 2.80 ఎకరాల భూమిని కుమారుడు శ్రీనివాసులు బదలాయించుకున్నాడు. అతడి నుంచి డి హీరేహాళ్ కు చెందిన టీడీపీ నాయకుడు, రియల్టర్ వన్నూర్‌స్వామి రూ.62 లక్షలకు కొనుగోలు చేసి రూ.15 లక్షలు అడ్వాన్స్ చెల్లించాడు. గుంతకల్లుకు చెందిన మరో రియల్టర్ శ్రావణ్‌కుమార్‌కు ఆ భూమిని అప్పగిస్తూ అడ్వాన్స్ తీసుకున్నాడు. రిజిస్ట్రేషన్ లేకనే విలువైన భూమి ఇలా చేతులు మారింది. గుంతకల్లు రియల్టర్ శ్రావణ్‌కుమార్ ఎలాంటి అనుమతులు పొందకుండా లే అవుటట్ వేశాడు. ప్లాట్లు వేసి ఒక్కోటి రూ.1.20 లక్షలు నుంచి రూ.1.50 లక్షల మధ్య అమ్మకం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొనుగోలు చేశారు. వారి వద్ద అడ్వాన్స్ రూపంగా రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకూ అందుకున్నాడు. రిజిస్ట్రేషన్ రోజు మిగిలిన మొత్తం చెల్లించేలా అగ్రిమెంట్లు రాసుకున్నారు. ఇలా అరకోటికి పైగా సొమ్ము పోగు చేసుకున్నాడు. మొత్తం డబ్బు చెల్లించాకే భూమిలో అడుగు పెట్టాలని యజమానికి చెప్పడంతో అడ్వాన్స్ డబ్బుతో ఉడాయించాడు.

ఎస్పీకి ఫిర్యాదు

అడ్వాన్స్ పోనూ మిగిలిన మొత్తం తీసుకుని ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలంటూ కొనుగోలుదారులు గత కొన్ని నెలలుగా గుంతకల్లు రియల్టర్ వెంటపడుతున్నా స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూ యజమాని వద్దకు వెళితే తనకు సంబంధం లేదని చెప్పడంతో బాధితులంతా వారం క్రితం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత శుక్రవారం సుమారు 30 మందికి పైగా తరలివచ్చి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శ్రావణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. అనంతరం అర్బన్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రూ.95 వేలు చెల్లించా

తక్కువ ధరకే ప్లాట్ల విక్రయం చేపట్టామని శ్రావణ్‌కుమార్ చెప్పిన మాయ మాటలు నమ్మి మోసపోయాం. అడ్వాన్స్‌గా రూ.95 వేలు ముందే చెల్లించాం. ఆరు నెలలకు పైకావస్తున్నా రిజిస్ట్రేషన్ ఊసే లేదు. అడిగితే దాట వేస్తున్నారు. అధికారులే మాకు న్యాయం చేయాలి.

– శివ, రంగచేడు

కొనుగోలు చేపట్టరాదని బోర్డు పెట్టారు

రియల్టర్‌తో ప్లాటు కొనుగోలు చేశా. అడ్వన్స్‌గా రూ.40 వేలు చెల్లించాను. రిజిస్ట్రేషన్ కోసం వెంటపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఆఖరుకు ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదు. తీరా చూస్తే లేఅవుట్‌లో అగ్రిమెంట్లు రద్దయ్యాయని హెచ్చరిక బోర్డు పెట్టారు. దీంతో దిక్కుతోచడం లేదు

– పాండు, చౌడమ్మగుడి ఏరియా

విచారించి న్యాయం చేస్తాం



అడిగుప్ప దారిలో ఏర్పాటు చేసిన లే అవుట్ పూర్తి అనధికారికంగా ఉంది. ప్లాట్లు కొనుగోలు చేసి కొందరు మోసపోయారు. రియల్టర్ శ్రావణ్‌కుమాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎవరూ మోసపోకండి.

– ఓబులేసు, తహసీల్దార్, రాయదుర్గం

అంబేడ్కర్ గురుకులానికి ఎంపీ నిధులు

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలో ఉన్న అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి ఎంపీ తలారి రంగయ్య రూ.5లక్షల నిధులు శుక్రవారం మంజూరు చేశారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ రెండు నెలల క్రితం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని కలసి గురుకులంలో విద్యార్థినిలు ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. స్పందించిన ఆయన ఎంపీతో కలిసి గురుకులాన్ని సందర్శించగా.. తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి రూ.5 లక్షలు మంజూరుచేస్తున్నట్లు ఎంపీ ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ నిధులతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయన్నారు. ఈసందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీకి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు ధన్యవాదాలు తెలిపారు.

రాయదుర్గం మీదుగా ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం రాయదుర్గం మీదుగా బెంగళూరు–బీజాపురం మధ్య ప్రత్యేక రైలు సర్వీసు నడపనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్ మనీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 10, 14 తేదీల్లో ఈ రైలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికులు ప్రత్యేక రైలును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాగ్రత్తలు పాటించాలి

ఉరవకొండ: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు సూచించారు. శుక్రవారం ఉరవకొండ పట్టణంలో డ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డితో కలిసి జిల్లా మలేరియా నివారణ అధికారి పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఏరియా ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా(ఏఓ)గా డి.మహబూబ్ బాషా బాధ్యతలు స్వీకరించారు. ఆదోనిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఆయన పదోన్నతిపై ఏఓగా రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి వచ్చినట్లు వైద్యాధికారి మాధవి తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, నర్సులు సత్కరించారు.

హెచ్చెల్సీ, జీబీసీ కింద పంటలను కాపాడండి

- మంత్రులు అంబటి, పెద్దిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జలను కోరిన మాజీ ఎమ్మెల్యే విశ్వ



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలో హెచ్చెల్సీ, జీబీసీల కింద వేల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగుచేశారని, హెచ్చెల్సీకి ఈనెల 10న నీరు నిలిపివేస్తున్న నేపథ్యంలో ఆ పంటలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేయాలని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని శుక్రవారం విజయవాడలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి వేర్వేరుగా కలిసి కోరారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10న హెచ్చెల్సీకి నీరు నిలిపివేస్తున్న తరుణంలో హెచ్చెల్సీ, జీబీసీ కింద వేలాది ఎకరాల్లో సాగైన వరి, పత్తి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. తుంగభద్ర నుంచి అదనపు నీరు తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అది కుదరని పక్షంలో ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో డిసెంబర్ ఆఖరు వరకూ నీరు విడుదల చేయించాలని కోరారు. అలాగే హంద్రీనీవా నీరు ఉరవకొండ నియోజకవర్గం మీదుగా వెళుతున్నందున.. ఆ నీటిని హెచ్చెల్సీకి మళ్ళించి పంటలను కాపాడే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే కాకుండా అనంతపురం జిల్లా అంతటికి తాగునీరు అందించే పీఏబీఆర్ జలాశయం ఈ ఏడాది తీవ్ర వర్షాభావ, ఇతర పరిస్థితుల వల్ల నీటి నిల్వ తక్కువగా ఉన్న విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో వచ్చే వేసవి నాటికి జిల్లాలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున హంద్రీనీవా నుంచి అదనంగా నీటిని పీఏబీఆర్‌కు తరలించి కనీసం నాలుగు టీఎంసీలు నిల్వ ఉండేలా చేయాలని కోరారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని, అయితే అతి తక్కువ వర్షపాతం నమోదు అయ్యే బెళుగుప్ప మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ వెంట జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సేవలను మరింత మెరుగుపరచాలి

రాయదుర్గంటౌన్: ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్గో పార్సిల్ సర్వీసులతోపాటు డోర్ డెలవరీపై ప్రత్యేక దృష్టి సారించి సేవలు మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అనంతపురం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సూచించారు. శుక్రవారం ఆయన రాయదుర్గం డిపో, కార్గో సర్వీస్ సెంటర్, బస్టాండ్ పాయింట్లను ఆకస్మిక తనిఖీ చేశారు. డిపో మేనేజర్ సురేష్‌కుమార్‌తో ప్రయాణికులకు అందుతున్న సేవలు, బస్సు సర్వీసులు, ఆదాయం ఇతరాత్ర విషయాలపై సమీక్షించారు.

రాయితీ పాఠ్యపుస్తకాల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్, కళాశాలలో శుక్రవారం డిప్లమా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 20 శాతం రాయితీతో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఐఏఎస్ శ్రీమతి చదలవాడ నాగమణి సారథ్యంలో సి–కరిక్యులం ఈ సంవత్సరం నుంచి అమలు చేస్తామన్నారు.

‘ఆరోగ్య సురక్ష’ ప్రజలకు వరం

సెట్టూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని సర్పంచ్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లోపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామారావు, డాక్టర్లు వేణు, తరుణ్, సాయి, సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు విరుపాక్షి, అనందప్ప, నూరప్ప పాల్గొన్నారు.


మట్కాస్థావరంపై పోలీసుల దాడి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామ శివారు ప్రాంతంలోని నేషనల్ హైవే వద్ద మట్కా స్థావరంపై శుక్రవారం ఏఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. మట్కా రాస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 22 వేల నగదు, టీటీలను స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక వెళ్లి పింఛన్ అందజేత

కూడేరు: మండలంలోని కరుట్లపల్లికి చెందిన పింఛన్ లబ్ధిదారురాలు సావిత్రి అనారోగ్యంతో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి 40 కిమీ దూరంలో ఉన్న దోర్నగల్లులో కూతురు వద్ద ఉంది. విషయం తెలుసుకున్న వలంటీర్ కుళ్లాయప్ప శుక్రవారం సొంత ఖర్చులతో తోర్నగల్లుకు వెళ్లి పింఛన్ నగదు అందజేశాడు. వలంటీర్‌ను పలువురు అభినందించారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



కుందుర్పి: ఆర్మీ జవాన్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన నిజవళ్లి గ్రామ నివాసి బసవరాజును తహసీల్దార్ విజయకుమారి తదితరులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీలు తిప్పేస్వామి, వీఆర్‌ఓ సంజీవిరెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: మండల ంలోని పీటీఆర్ పల్లి ఎగువ తండా, దిగువ తండాలో సెబ్ పోలీసులు దాడి చేసి సుమారు 620 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే ఈస్ట్ కోడిపల్లి సమీపంలో ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. ద్విచక్రవాహనం సీజ్ చేసి నిందితుడు లక్ష్మన్నను అరెస్టు చేశారు. సీఐలు నరసానాయుడు, సోమశేఖర్, సెబ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వరుణ్‌కుమార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం బాలాజీ శుక్రవారం తెలిపారు. త్వరలో అరకులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభను చాటాలని పీఈటీ అమర్‌నాథ్, పీసీ కమిటీ చైర్మన్ హేమాచారి ఆకాంక్షించారు.

పశు వైద్య శిబిరానికి స్పందన

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో శుక్రవారం వాటర్‌షెడ్ పథకంలోని నిధులతో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసగుప్త, డాక్టర్ మంజునాథ్, సర్పంచ్ శోభరాణి, ఎంపీటీసీ తిప్పమ్మ, బోరంపల్లి వాటర్ షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ఉరవకొండ(విడపనకల్లు): వేరుశనగ లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ తిప్పేనాయక్ వివరాల మేరకు.. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి నుంచి వేరుశనగ లోడుతో బళ్లారికి పంటను విక్రయించేందుకు వెళుతున్న బొలెరో వాహనం విడపనకల్లు వద్ద టైరు పంచరు కావడంతో బోల్తా పడింది. రైతు విజయ్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ శుక్రవారం డి హీరేహాళ్ మండలం కల్యంకు చెందిన బోయ చాడేష్, హెచ్.పరసప్ప పట్టుబడ్డారని సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 192 టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకుని, ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బంది అనిల్, ప్రతాప్, శివ, జ్యోతి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మనందరి భవిష్యత్తుకు జగనన్న గ్యారంటీ



సొల్లాపురంలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గంటౌన్: మెడికల్ కిట్లను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: మనందరి బంగారు భవిష్యత్తుకు జగనన్నే గ్యారంటీ అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. టీడీపీ అధికారంలో వస్తే ఊళ్లో ఉన్న పదారు పచ్చకుక్కలు బాగు పడతాయి.... వైఎస్సార్‌సీపీ అధికారంలో వస్తే ఊరంతా బాగుపడుతుందన్నారు. మండలంలోని సొల్లాపురం గ్రామంలో రూ. 43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్బీకేను ఎంపీపీ సంధ్య, సర్పంచు మహేశ్వరితో కలిసి విప్ ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ ప్రతి ఊళ్లో సచివాలయాలు, ఆర్బీకే, వైలెనెస్ సెంటర్లు... గ్రామాభివృద్ధి చిహ్నాలుగా దర్శనమిస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలు ఊర్లోనే అందిస్తున్నామన్నారు. మా నుంచి మీకు మంచి జరిగితే ఓటేయ్యండని ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా అడగగలుతాం... ఇలా జనంలో వచ్చి నీవు అడగగలవా అంటూ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు విప్ కాపు సవాల్ విసిరారు. ఇద్దరం కలసి ఒకే వెహికల్‌లో వెళుదాం... నీ ఐదేళ్ల పాలనలో జనాలకు ఊరికి ఏం చేశావో చెప్పు... నేను నాలుగున్నరేళ్లలో ఏం చేశానో చెబుతాను.. ఎవరు మంచి చేస్తే వారికే ఓటేయమని ప్రజలను అడుగుదామన్నారు. ఈ సవాల్‌కు సిద్ధమా? అని ప్రశ్నించారు. అలాగే 2014 ఎన్నికల్లో 610 హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబు మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు ఆలూరు చిక్కణ్ణ, టి.కేశవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప, స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, జగన్నాథరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రాజెట్ల అశోక్, కాపు శివరామిరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత రానివ్వకుండా ముందస్తు చర్యలు

రాయదుర్గం పట్టణానికి వేసవిలో తాగునీటి కొరత రానివ్వకుండా ముందస్తు చర్యలు తీసుకొంటున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. కణేకల్లు శివారులో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకును శుక్రవారం రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డితో కలిసి విప్ కాపు సందర్శించారు. పంప్‌హౌస్ ద్వారా నీటి పంపింగ్ ప్రక్రియ గురించి విప్ కాపు ఆరా తీశారు. సాధారణంగా 60 హెచ్‌పీ కెపాసిటీ గల నాలుగు మోటార్లతో పంప్‌హౌస్ నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నీటి పంపింగ్ చేస్తామని మీరు చెప్పినట్టుగానే అదనంగా 20 హెచ్‌పీ మోటార్ హెచ్చెల్సీ కాలువ వద్ద ఏర్పాటు చేసి నేరుగా ట్యాంకులోకి నీరును పంపింగ్ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్, నీటి సరఫరా విభాగం ఏఈ కోదండరాముడు విప్ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి తాగునీటి పథకం ద్వారా వేసవిలో సైతం తాగునీరు పుష్కలంగా అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది హెచ్చెల్సీకి చాలా తక్కువ సమయంలో నీరు రావడంతో భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా సమ్మర్ స్టోరేజీలో గరిష్టస్థాయిలో నీటి నిల్వకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలదీవెనలే ప్రభుత్వానికి అండ

రాయదుర్గంటౌన్: ప్రతి అడుగులో మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల చల్లని దీవెనలే కొండంత అండ అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని 3,4 వార్డుల ప్రజలకు శాంతినగర్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద డీఆర్‌ఎల్ భవనంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని గురువారం కౌన్సిల్ సభ్యులతో కలిసి విప్ సందర్శించారు. విప్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇందుకు సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పుల్లో భాగమన్నారు. చంద్రబాబుకు ఐదేళ్ల అవకాశం ఇస్తే ప్రజలకు ఏం చేశాడో చెప్పుకునేందుకు ఒక్క పథకమైనా ఉందా అని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీ సిద్దప్ప, పట్టణ కన్వీనర్ ఆరవా శివప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, బండి అజయ్, వార్డు ఇన్‌చార్జ్ బషీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

పట్టణంలోని 21వ వార్డు నర్సోజీరావు కుంట వద్ద గడప గడపకూ మన ప్రభుత్వం కింద మంజూరైన రూ.10 లక్షలతో సిమెంట్ డ్రైనేజీ నిర్మాణానికి వార్డు కౌన్సిలర్ డిష్ గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, పట్టణ కన్వీనర్ ఆరవా శివప్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. వివిధ పథకాల నిధులతోపాటు గడప గడప కింద రూ.3.65 కోట్లతో అన్ని వార్డుల్లో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీ సిద్దప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, పెద్ద వన్నూరుస్వామి, షబ్బీర్, శ్రీనివాసరెడ్డి, ఫక్రుద్దీన్, బండి అజయ్, మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు నజీర్, కాంట్రాక్టర్లు నేత్రపల్లి కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వడానికి ఏర్పాట్లు



జంగిల్ క్లియరెన్స్ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ(విడపనకల్లు): మండల కేంద్రం విడపనకల్లులో పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం విడపనకల్లులోని సర్వే నంబర్ 502, 503లో మూడు జేసీబీల ద్వారా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, నాయకులు కరణం భీమిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఇంటి స్థలాలు ఇవ్వడానికి 552 సర్వే నంబర్ కేటాయించారన్నారు. ఈ సర్వే నంబర్‌కు దగ్గర్లో శ్మశాన వాటిక ఉండటంతో గడప గడపకూ వెళ్లినపుడు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి మరో చోట స్థలం కేటాయించాలని ప్రజలు వినతి పత్రాలు అందించారన్నారు. స్పందించిన ఆయన మరో సర్వేనెంబర్‌లో భూమి కేటాయించి ప్లాట్లు వేయాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదేశించడంతో పాటు వారు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారన్నారు. త్వరలోనే పేదలకు ఇంటిస్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిబాబు, యూత్ విభాగం మండల అధ్యక్షుడు సిద్దార్థ, కోఆప్షన్ సభ్యులు లతీఫ్, జనార్దన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సేవలు

బెళుగుప్ప: కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రైతు సహకార బ్యాంకులు సేవలను అందిస్తున్నాయని బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, కళ్యాణదుర్గం సహకార బ్యాంకు మేనేజర్ హనుమంతురాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు రుణాల విధి విధానాలపై ప్రసంగించారు. బెళుగుప్ప సహకార సంఘం సుమారు రూ.7కోట్ల లావాదేవీలు, రూ.60 లక్షల డిపాజిట్లు, రూ.70 లక్షల సభ్యత్వ మొత్తాలతో ఉత్తమ సేవలందించి ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును పొందిందన్నారు. కళ్యాణదుర్గం సహకార బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పవన్, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు పాటిల్ నాగిరెడ్డి, సంఘ సీఈఓ పాండురంగ, ఎంపీటీసీలు ఈశ్వర్, గాంగ్యానాయక్, మాజీ ఎంపీపీ వన్నూరస్వామి, ఉప సర్పంచ్ పాతన్న పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

ఉరవకొండ: జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిణి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బుకొఠారి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ అమృతరాజ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి హౌసింగ్ ఏఈ హర్షవర్ధన్, ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కీటకాల ద్వారా ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కూడేరు: దోమకాటుతో మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర జ్వరాలు వ్యాపిస్తాయని హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర , ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవిద్య అన్నారు. మండలంలోని కొర్రకోడులో డెంగీ కేసులు నమోదు కావడం, జ్వరాలతో ప్రజలు బాధపడుతుండడంతో శుక్రవారం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి, పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

కంబదూరు: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వైద్య సేవలు అందుతున్నాయని వైద్యాధికారి ఆసియా అన్నారు. శుక్రవారం మండలంలోని కురాకులపల్లిలో 104 వాహనం ద్వారా గ్రామస్తులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.